క్లుప్తంగా

నేడు జాతీయ పెన్షనర్ల దినోత్సవం

ఒంగోలు: జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆదివారం కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కోశాధికారి వాకా శంకరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభాధ్యక్షులుగా సాపల విశ్వరూపాచారి, ముఖ్యఅతిథిగా ఎంవెంకటేశ్వరరావులు హాజరవుతారన్నారు. ఉదయం 10గంటలకు కార్యక్రమం జరుగుతుందని, రిటైర్డ్ ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

అంధ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ఒంగోలు మెట్రో: స్థానిక రావి ఆంజనేయులు వీధిలోని గుడ్ న్యూస్ మినిస్ట్రీస్ అంధుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి దుప్పట్లు పంపిణీ చేశారు. సీనియర్ పాత్రికేయుడు ఆర్ రామకృష్ణ కుమార్తె పెళ్లి రోజును పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ప్రజా రచయిత డాక్టర్ మొగిలి దేవ, తిరుపతిరెడ్డి, జగన్మోహన్‌రావు, పాఠశాల నిర్వాహకులు మోహన్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం


స్వామి వారి కల్యాణం

ఒంగోలు మెట్రో: నగరంలోని కేశవస్వామిపేటలో వేంచేసియున్న ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఉపాలయమైన శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి మాస కల్యాణం శనివారం రాత్రి ఆలయ అర్చకులు నాగార్జునదేవ్, రాంబాబుల ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి దేవస్థానం ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్య నిర్వహణాధికారి డి.రజనీకుమారి, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ధనుర్మాస సందర్భంగా ఆలయంలో ఈ నెల 17 నుంచి ప్రతిరోజు ఉదయం 6 గంటలకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచకులు రమేష్ వారి చేత తిరుప్పావై పాశురాలు నెల రోజుల పాటు కొనసాగుతాయని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పై గౌతమి

ఒంగోలు: నేరాలకు దూరంగా ఉండాలని దిశ ఏఎస్సై గౌతమి అన్నారు. స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో ర్యాగింగ్, సైబర్ క్రైమ్, వేధింపులు వంటి వాటికి స్వస్తి పలుకుదాం అంటూ శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాగింగ్ అనేది చట్టరీత్యా నేరం అని పేర్కొంటూ దిశ యాప్ ఎలా ఉపయోగపడుతుంది, వేధింపుల నుంచి రక్షణ పొందడం ఎలా, దానికి యాప్‌ను రిజిస్ట్రేషన్ మొదలు డౌన్‌లోడ్ వరకు చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. నేడు సైబర్ నేరాలు వెర్రితలలు వేస్తున్నాయని, వాటిని అరికట్టేందుకు విద్యార్థులు సంయుక్తంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పేస్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొని పలు సూచనలుచేశారు.

వైభవంగా చెన్నకేశవునికి శాంతి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం వైభవంగా, కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయం మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలంకరణలో ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు.

211 మందికి వైద్య పరీక్షలు

బేస్తవారిపేట: మండలంలోని వంగపాడులో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 211 మందికి వైద్య పరీక్షలు చేశారు. కంటి శస్త్రచికిత్సలు 36 మందికి, ఈఎన్‌టీ ఒకరు, ఆర్థో ఆపరేషన్‌లు నలుగురికి, సాధారణ శస్త్రచికిత్సలు నలుగురికి అవసరమవుతున్నట్లు బ్రహ్మానందరెడ్డి తెలిపారు.

విద్యుత్ ఆదాలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యన్నారాయణ, హాజరైన విద్యార్థులు

● విద్యుత్‌శాఖ ఎస్ఈ సత్యన్నారాయణ

ఒంగోలు: విద్యుత్ ఆదాలో విద్యార్థులు భాగస్వాములు కావాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ కేవీజీ సత్యన్నారాయణ అన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యుత్‌శాఖ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఈ కేవీజీ సత్యన్నారాయణ మాట్లాడుతూ విద్యుత్ పొదుపు చిట్కాలు పాటిస్తూ విద్యుత్‌ను పొదుపు చేయాలన్నారు. ఒక యూనిట్ విద్యుత్‌ను ఆదా చేస్తే రెండు యూనిట్లు ఉత్పత్తికి అది సమానమవుతుందన్నారు. కాలేజీ డైరెక్టర్ ఏవీ భాస్కరరావు, విద్యుత్ శాఖ టంగుటూరు మండల ఏఈ పి.శ్రీనివాసులు, డీఈఈ ఆర్.మోహన్‌రావు, ఏఈఈ టి.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులను తిప్పికొట్టాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రఘు

ఒంగోలు టౌన్: దేశానికి ప్రమాదకరంగా తయారైన మతోన్మాద శక్తులను ప్రజలు తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.రఘు పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం నగర పార్టీ సభ్యుల శిక్షణ తరగతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. దేశంలో జరుగుతున్న మతోన్మాద దాడులు, హత్యలను, అత్యాచారాలను తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. అనేక కులాలు, మతాలు కలగలసిన దేశ ప్రత్యేకత అయినటువంటి లౌకిక స్వభావాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థుల్లో మతోన్మాద భావనలను పెంచి పోషించడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న మోదీ దేశాన్ని మతతత్వ కార్పొరేట్ శక్తుల గుప్పిట్లో పెట్టేందుకు బరితెగిస్తుందన్నారు. దేశ ప్రజల సంపదను బడాబాబులకు దోచిపెడుతూ ప్రజలు ప్రశ్నించకుండా ఉండేందుకు విద్వేషాలను రాజేస్తుందని చెప్పారు. నిరుపేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు ఒక్కతాటిపైకి వచ్చి దేశాన్ని మతోన్మాద శక్తుల నుంచి కాపాడేందుకు ఉద్యమించాలని కోరారు. శిక్షణ తరగతుల్లో దామా శ్రీనివాసరావు, ఎస్డీ హుసేన్, తంబి శ్రీనివాసరావు, జి.రమేష్, కె.శ్యామ్, ఏ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఓటు సద్వినియోగం

● 80 ఏళ్లు నిండిన ఓటర్లను సత్కరించిన రెవెన్యూ అధికారులు


80 సంవత్సరాలు నిండిన ఓటర్లను సత్కరిస్తున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వరకుమార్

చీమకుర్తి: 80 సంవత్సరాలు నిండి, ఓటేయలేని స్థితిలో ఉన్న ఓటర్లకు వారి ఇంటి వద్ద నుంచే ఓటేసుకునే సదుపాయాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్.వరకుమార్, తహసీల్దార్ పీ.మధుసూదన్‌రావు తెలిపారు. శనివారం చీమకుర్తిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద 80 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి వారిని ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి 80 సంవత్సరాలు నిండిన ఓటర్లు 20 మంది ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వారందరినీ ఘనంగా సత్కరించి రానున్న ఎన్నికల్లో పోలింగ్ బూత్ వద్దకు వెళ్లి ఓటేయలేకపోతే ఇంటి వద్ద నుంచే ఓటేసే సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయం సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలి


లేగదూడల యజమానులకు బహుమతులు అందజేస్తున్న జేడీ డా.బేబిరాణి

నాగులుప్పలపాడు: పశు పోషకుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఉపయోగించుకొని పాడి పరిశ్రమలో ఉన్నతంగా ఎదగాలని పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డా.బేబిరాణి అన్నారు. కనపర్తి గ్రామ సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించిన జేడీ అక్కడి రైతులతో రచ్చబండ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ బేబిరాణి మాట్లాడుతూ పశు పోషకుల సంక్షేమం కోసం ప్రభుత్వం రాయితీలో పశు గ్రాస విత్తనాలతో పాటు దాణామృతాన్ని అందిస్తుందని, దీనిని ఉపయోగించుకొని రైతులు అధిక లాభాలు పొందాలన్నారు. అనంతరం పడ్డదూడలకు, పెయ్య దూడల్లో బ్యాక్టీరియా ద్వారా సంక్రమించే బ్రూసిల్లోసిస్ వ్యాధి, దాని నిర్మూలన వంటి అంశాలపై పాడి రైతులకు అవగాహన కల్పించడంతో పాటు టీకాలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లేగ దూడల ఆరోగ్య సంరక్షణ పోటీలో ఆరోగ్యకరంగా ఉన్న దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. డీఎల్‌డీఏ డీడీ డా. కాలేషా, నాగులుప్పలపాడు ఏడీఏ నాగభూషణరావు, బసవశంకరరావు, డా.సురేఖ, డా.జాస్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ ఈతముక్కల


ఓవరల్ చాంపియన్‌గా నిలిచిన ఈతముక్కల విద్యార్థులు

ఈతముక్కల (కొత్తపట్నం): పాలిటెక్నిక్ జిల్లాస్థాయి ఆటల పోటీల్లో ఈతముక్కల విద్యార్థులు ఓవరల్ చాంపియన్‌గా నిలిచారు. ఈతముక్కల మహిళా పాలిటెక్నిక్ కాలేజీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో 7 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ఈతముక్కల విద్యార్థునులు ఖోఖో, చెస్, సింగల్ షటిల్, షటిల్ డబుల్, సింగిల్ టేబుల్‌టెన్నీస్, డబుల్ టేబుల్ టెన్నీస్‌లో విన్నర్‌గా నిలిచారు. ఖోఖో రన్నర్‌గా రైస్ కాలేజీ, షటిల్ సింగిల్స్‌లో అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ రన్నర్‌గా, షటిల్ డబుల్‌లో ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ రన్నర్‌గా నిలిచారు. వాలీబాల్ విన్నర్‌గా పేస్ కాలేజీ, రన్నర్‌గా రైస్ కాలేజీ విద్యార్థులు నిలిచారు. టేబుల్‌టెన్నీస్ డబుల్‌లో రన్నర్‌గా ఈతముక్కల విద్యార్థునులు నిలిచారు. టేబుల్‌టెన్నీస్ సింగిల్, డబుల్ రైస్ కాలేజీ విద్యార్థులు సాధించారు. రన్నింగ్ 800 మీటర్ల విభాగంలో ఈతముక్కల హైస్కూల్ విద్యార్థిని ఎం మానస ప్రథమ బహుమతి, రన్నర్‌గా సీహెచ్ లక్ష్మి పూజిత నిలిచింది. 400 మీటర్ల పరుగు పందెంలో ఈతముక్కల పాలిటెక్నిక్ విద్యార్థి మానస విన్నర్‌గా నిలిచింది. 200 మీటర్ల పరుగు పందెంలో విన్నర్‌గా రైజ్ కాలేజీ విద్యార్థిని విన్నర్‌గా, రన్నర్‌గా జ్యోతికా నిలిచింది. 100 మీటర్ల పరుగు పందెంలో విన్నర్‌గా ప్రశాంతి నిలిచింది. 4x100 రిలేలో విన్నర్‌గా ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ, రన్నర్‌గా రైస్ కాలేజీ నిలిచారు. లాంగ్ జంప్ విన్నర్‌గా మానస, రన్నర్‌గా ఎస్ కుమారి, ట్రిబుల్ జంప్ విన్నర్‌గా లక్ష్మి పూజిత, రన్నర్‌గా భవ్య విజయం సాధించారు. గెలుపొందిన విద్యార్థునులకు బహుమతులు, ప్రశంసపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎంపీడీఓ డాక్టర్ పి.సుజాత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆటల పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో భగవద్గీత పోటీలు

ఒంగోలు మెట్రో: కొత్తపట్నంలోని చిన్మయ శారదా తపోవన్ ఆశ్రమంలో ఈ నెల 17న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రస్థాయి భగవద్గీత పఠనపోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లోని 17 ఉమ్మడి జిల్లాల్లో పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఆదివారం రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

ఒంగోలు రూరల్: మండంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ పి.అజిత సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది సమక్షంలో కేంద్రాల్లో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. గర్భిణులకు ఇవ్వాల్సిన పోషకాహార పదార్థాలను సచివాలయ సిబ్బంది సమక్షంలో నమోదు చేసుకుని పంపిణీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరుకాని నేపథ్యంలో పౌష్టికాహారం పంపిణీ లో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ కరవది-1 కాంతారావు, ఐసీడీఎస్ ఒంగోలు రూరల్ సూపర్‌వైజర్ ఎలిజబెత్ రాణి, మహిళా కానిస్టేబుల్ నాగలక్ష్మి ఉన్నారు.

తామరపురుగు నివారణకు ఉల్లిపాయల కషాయం

మదనూరు (కొత్తపట్నం): పచ్చిమిర్చిలో వచ్చే తామరపురుగు నివారణకు ఉల్లిపాయల కషాయం బాగా పనిచేస్తుందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్, యూనిట్ ఇన్‌చార్జి పిట్టు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో తామర పురుగు నివారణకు ప్రకృతి వ్యవసాయంతో ఉల్లిపాయ కషాయం ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు. బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి పొలంలో ప్రకృతి వ్యవసాయం సాగుబడికి ఆకుకూరలు, కూరగాయలు పండించేందుకు ఘన జీవామృతం తయారీ విధానాన్ని వివరించారు. ఎకరానికి 400 కేజీల ఘనజీవామృతం వేసుకుంటే రసాయన ఎరువులు అవసరం లేకుండా పండించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి పిట్టు వెంకటేశ్వరరెడ్డి, షేక్ రెహ్మాన్ బాషా, మనోహర్, కాశీముబీ హాజరయ్యారు.

పారిశుధ్య పనులు పరిశీలించిన డీపీఓ


ఎబేట్ చల్లిస్తున్న డీపీఓ నారాయణ రెడ్డి

మద్దిపాడు: మండలంలోని సీతారాంపురం సచివాలయం పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులు, దోమల నివారణకు ఎబేట్ చల్లించే కార్యక్రమాలను డీపీఓ నారాయణరెడ్డి పరిశీలించారు. శనివారం ఆయన సీతారాంపురం సచివాలయ పరిశీలనకు వచ్చారు. ఈక్రమంలో ఆయన సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం సచివాలయ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ సర్పంచ్ శివానందరావు, ఈఓపీఆర్‌డీ సుబ్బారావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగొండలో శ్రీవారికి పూజలు


అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: మార్గశిర మాసం శనివారం సందర్భంగా మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శ్రీవారిని దర్శించుకొని పునీతులయ్యారు. నమో వెంకటేశాయా నమో నమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

అవయవదాత రఘునాథరెడ్డికి ఘన నివాళి

పెద్దదోర్నాల: తాను చనిపోతూ మరి కొందరి ప్రాణాలు కాపాడిన వైఎస్సార్ సీపీ మండల నాయకుడు కాసా రఘునాథరెడ్డి రెండో వర్ధంతి శనివారం మండల కేంద్రంలో నిరాడంబరంగా జరిగింది. 2021 డిసెంబర్ 13వ తేదీన నల్గొండ జిల్లా దేవరకొండ మండలం చింతపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రఘునాథరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్నేహితులు చికిత్స కోసం ఆయన్ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్చారు. చికిత్స పొందుతున్న రఘునాథరెడ్డికి బ్రెయిన్ డెడ్ అయింది. కుటుంబ సభ్యులు నిమ్స్ వైద్యశాలకు తరలించి 48 గంటల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచారు. అవయవదానానికి ఆయన కుటుంబ సభ్యులు అంగీకరించారు. నిమ్స్‌లో రఘునాథరెడ్డి భౌతిక కాయం నుంచి గుండె, ఊపిరి తిత్తులు, కిడ్నీ, లివర్, కళ్లు, చర్మం, కాలేయం తదితర ఆర్గాన్‌లను వైద్యులు సేకరించి మరికొంత మంది ప్రాణాలు కాపాడారు. ఈ నేపథ్యంలో శనివారం రఘునాథరెడ్డి రెండో వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో పలువురు నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్‌లు, పండ్లు పంపిణీ చేవారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ భాస్కర్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు లాలూనాయక్, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, అమిరెడ్డి లక్ష్మీరెడ్డి, సత్యనారాయణరెడ్డి, జయప్రకాష్ నాయుడు, అంజిరెడ్డితో పాటు రఘునాథరెడ్డి సోదరుడి కుమారుడు కాసా మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వినియోగదారుల క్లబ్ ఏర్పాటు

● విద్యార్థులకు అవగాహన కల్పించిన ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు నాగేశ్వరరావు

మద్దిపాడు: ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వినియోగదారుల క్లబ్ ఏర్పాటు చేస్తున్నట్లు విశ్రాంత ప్రధానాచార్యులు, సీఏపీ సీఓ చైర్మన్, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో మొదటిసారిగా మద్దిపాడు జూనియర్ కళాశాలలో వినియోగదారుల క్లబ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నాణ్యతలేని వస్తువులు పంపే కంపెనీలపై వినియోగదారుల ఫోరంలో ఏవిధంగా ఫిర్యాదు చేయవచ్చన్న విషయాన్ని ఆయన విద్యార్థులకు తెలిపారు. నష్ట పరిహారం పొందే విధానం గురించి వివరించారు. వినియోగదారులు నష్టపోయిన క్రమంలో 1915 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చని అన్నారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులందరినీ క్లబ్ లో జాయిన్ చేసినట్లు కోఆర్డినేటర్ టీ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి హాజరైన డీఎస్‌ఓ ఉదయ భాస్కర్ మాట్లాడుతూ వినియోగదారుని హక్కులు, కంపెనీల నుంచి నష్ట పరిహారం పొందే విధానాలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో వారి వెంట అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ భాస్కరరావు, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర రావు, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీగిరిలో భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం


చతుర్వేద పారాయణంలో వేద పురోహితులు

ఒంగోలు మెట్రో: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఒంగోలులోని కొండమీద శ్రీగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ చేశారు. నాద నీరాజనం, చతుర్వేద పారాయణ విష్ణు సహస్రనామ పారాయణ, సంకీర్తనల ఆలాపన జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఆలూరు వేంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు శ్రీగిరి వేంకటేశ్వర స్వామికి సువర్ణ అష్ట దళ పద్మ పాదార్చన జరుగుతుందని, భక్తులు పేర్లను నమోదు చేసుకోవాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

జోయాలుక్కాస్ ఆఫర్ సీజన్ ప్రారంభం


ఆఫర్ సీజన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా

ఒంగోలు: స్థానిక జోయాలుక్కాస్ షోరూంలో పండుగ ఆఫర్ సీజన్‌ను డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రిస్మస్, నూతన సంవత్సరం పండుగలను పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించడం వినియోగదారులకు ఆనందదాయకం అన్నారు. బ్రాంచి మేనేజర్ పి.సరేష్ మాట్లాడుతూ తమ సంస్థ గివింగ్ ఆఫర్ క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బంగారం, డైమండ్ ఆభరణాలపై మజూరీ చార్జీలు (వీ.ఏ) పై 25శాతం తగ్గింపు ఇస్తున్నామన్నారు. ఈ ఆఫర్ 2024 జనవరి 15వ తేదీ వరకు అమలులో ఉంటుందన్నారు. పండుగ డిస్కౌంట్ కింద ఏడాదిపాటు బీమా, జీవిత కాలం ఉచితనిర్వహణ, బైబ్యాక్ గ్యారంటీ అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


ఏపీ పీటీడీ రిటైర్డ్ ఎంప్లాయీస్ వైఎస్సార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఒంగోలు: ఏపీ పీటీడీ రిటైర్డ్ ఎంప్లాయీస్ వైఎస్సార్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా యు.జానకిరావు నియమితులయ్యారు. స్థానిక ఏపీ పీటీడీ ఎన్ఎంయూ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. సమావేశంలో భాగంగా రాష్ట్ర, రీజనల్, డిపో కమిటీలకు బాధ్యులను ఎన్నుకున్నారు. అనంతరం రీజనల్ చైర్మన్‌గా ఎంపికైన వర్ల కొండయ్య వివరాలను మీడియాకు వెల్లడించారు. రాష్ట్ర కార్యదర్శిగా యు.జానకిరావు, రీజనల్ కార్యదర్శిగా ఎస్.వెంకట్రావు, ఒంగోలు డిపో కమిటీ కార్యదర్శిగా కె.ఆదిశేషయ్య, అధ్యక్షులుగా ఎన్.కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి జి.గురుబాబు, ఉపాధ్యక్షులుగా కె.సింగయ్య, కోశాధికారిగా అంజిబాబు, సహాయక కోశాధికారిగా వీఎస్ రావు, ప్రచార కార్యదర్శిగా ఎన్.కృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కె.వెంకట్రావు, ఎస్‌వీఎస్ రావు, కె.సుబ్బారావు, సభ్యులుగా జి.గురవయ్య, కెఎస్ రావు, కె.సుబ్బారావు, మధులు ఎన్నికైనట్లు ప్రకటించారు.

శివం ఫౌండేషన్ నిత్యాన్నదాన కేంద్రం ప్రారంభం


నిత్యాన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ అశోక్‌బాబు

ఒంగోలు మెట్రో: ఆపన్నులను ఆదుకోవడంలో శివం ఫౌండేషన్ మరో మైలు రాయిని దాటిందని ఏఎస్పీ అశోక్‌బాబు అన్నారు. స్థానిక సంతపేటలోని వెంకయ్య స్వామి గుడిలైన్లో ఏర్పాటు చేసిన శివం కాశీనాయన నిత్యాన్నదాన క్షేత్రాన్ని ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. తొలుత కాశీనాయక వెంకయ్య స్వామి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఐదేళ్లుగా వేలాది మంది ఆకలి తీరుస్తున్న శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరిని అభినందించారు. ఇప్పటికే మొబైల్ క్యాంటీన్ ద్వారా ఒంగోలులోని పలు కూడళ్లలో అన్నదానంతో పేదల ఆకలితీరుస్తూ నగర ప్రజలకే కాకుండా చుట్టుపక్క ప్రాంతాలకు కూడా శివం ఫౌండేషన్ సేవలు ఇప్పటికే విస్తృతంగా చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో సంతపేటలో నిత్యాన్నదానం కార్యక్రమం పెట్టి తన గొప్ప మనసును చాటుకున్నాడని కొనియాడారు. ధనవంతులు కూడా చేయలేని ఇటువంటి గొప్ప మానవతా కార్యక్రమాన్ని గొల్లపూడి శ్రీహరి చేపట్టడం సమాజానికి స్ఫూర్తిదాయకమని ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్ శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో శివం ఫౌండేషన్ సభ్యులు మారెళ్ల సుబ్బారావు, స్థల దాత నీరుకొండ విజయలక్ష్మి, కోసూరి శ్రీదేవి, మండవ లావణ్య, కొల్లా మధు, మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు తమ్మిశెట్టి రమాదేవి, కొమ్మి రమణయ్య, మండవ సుబ్బారావు, నూకతోటి శరత్బాబు, మొగిలి దేవా, మాచవరపు నాగాంజనేయులు, చిక్కాల కిరణ్‌కుమార్, బి రామకృష్ణ, భైరవేశ్వరానంద స్వామి పాల్గొన్నారు.